


క్యాలెండర్ ఆవిష్కరణ

పట్నంబజారు: సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం బుధవారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 19,845, ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రేషన్ పంపిణీ పరిశీలన



నరసరావుపేట రూరల్: వలంటీర్లు రేషన్ వాహనం వెంట ఉండి నరుకులు పంపిణీ పర్యవేక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఇక్కుర్రులో రేషన్ పంపిణీని బుధవారం ఆయన పరిశీలించారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి భారీ విరాళం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వర ఆలయానికి పూజిత డాల్ మిల్లర్స్ నిర్వాహకులు భారీ విరాళం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.10లక్షలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాతల్ని శాలువాలతో సత్కరించారు. ఆలయ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న పూజిత భాగస్వాములైన చందోలు మల్లికార్జున కుటుంబసభ్యుల్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులిపాటి రామారావు, పెండేల పుల్లారావు, మాల్యాద్రి, రెడ్డి నగేష్‌బాబు, జాగర్లమూడి సుబ్బారావు, గంధం బాలిరెడ్డి, దండు చెన్నయ్య, నాగపవన్‌కుమార్, ములకా రామతులసీరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన మంత్రి నాగార్జున



ఏఎన్‌యూ : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ప్రొఫెసర్ మేరుగ నాగార్జున బుధవారం వర్సిటీని సందర్శించారు. ఆయనకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధిని వీసీ వివరించారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వర్సిటీ పురోభివృద్ధికి తోడ్పాటు అందించాలని, రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయాల్లో ఏఎన్‌యూ ముందు వరుసలో నిలుస్తుందని మంత్రికి తెలియజేశారు. విశ్వవిద్యాలయాల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ఆచార్య కె మధుబాబు, సీడీఈ డైరెక్టర్ డాక్టర్. బి నాగరాజు, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్.ఉదయ్ కుమార్, డాక్టర్ అబ్రహం లింకన్ తదితరులు మంత్రిని కలిశారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున మాట్లాడుతూ 'నావెల్ ప్రాసెస్ అండ్ థెయిర్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై ఫిబ్రవరి 23, 24 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యల్లో పర్యావరణ, మొక్కలు దిగుబడి, అడవుల సంరక్షణ, క్యాన్సర్, డయాబెటిస్, ఏజింగ్, అల్జీమర్స్ వ్యాధుల మీద ప్రఖ్యాత శాస్త్రవేత్తల ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు, అధ్యాపకులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పీఎస్ఎన్ రాజు, డాక్టర్ కే బాబు, డాక్టర్ కే నాగరాజు, డాక్టర్ కే విజయ్ కుమార్, జ్యోతి ఆదిత్య పాల్గొన్నారు.

యార్డుకు 59,321 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 59,321 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 57,983 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 23,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 34,701 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

చిరునవ్వులు కురిపింఛెన్

- మనసున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి
- పెన్షన్ పెంపుదల వారోత్సవ సభలో వైద్యశాఖ మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు పింఛన్ కానుక చెక్కును అందజేస్తున్న మంత్రి విడదల రజిని, జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి , జేసీ రాజకుమారి

పాత గుంటూరు: లబ్ధిదారులకు ప్రతి నెలా మొదటి తేదీ ఉదయమే చిరునవ్వుతో వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3000ను ఇంటి ముంగిటకే అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమల్లో దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల వారోత్సవాలలో ఆమెతో పాటు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, మేయరు కావటి మనోహరనాయుడు పాల్గొన్నారు. సభకు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అధ్యక్షత వహించారు.

ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనం

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను దశల వారీగా రూ.3000 వరకు పెంచినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు నెలల వరకు రూ.1000 పెన్షన్‌ను రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల మందికి మాత్రమే అందించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే రూ.2250కి పెంచారన్నారు. ఇచ్చిన హామీ మేరకు నాలుగు సంవత్సరాల్లో రూ.3000 పెంచి 66.34 లక్షల మందికి పెన్షన్‌ను అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పెన్షన్లకు రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.2000 కోట్లు ఖర్చు చేస్తున్నదంటే.. పేదల సంక్షేమంపై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక

జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుకను అందిస్తోందని తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 60,436 మందికి ప్రతి నెలా రూ.18.23 కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 5,86,573 మందికి రూ.165.5293 కోట్లను ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తోందని చెప్పారు. వీటిలో వృద్ధాప్య పెన్షన్లు 2,86,264, వితంతు పెన్షన్లు 1,88,859, విభిన్న ప్రతిభావంతులు పెన్షన్లు 65,082, ఒంటరి మహిళలు 34,403 మంది ఉన్నట్లు ఆమె వెల్లడించారు. కిడ్నీ డయాలసిస్ రోగులకు రూ. 10,000, వివిధ దీర్ఘకాలిక రోగులకు రూ.3000 నుంచి రూ.10,000 వరకు అందిస్తున్నారని తెలిపారు. నగరపాలక సంస్థ మేయరు కావటి శివనాగ మనోహర నాయుడు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలుకు, లబ్ధిని ఇంటి వద్దకే వచ్చి అందించటానికి దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 25,966 మందికి రూ.7.84 కోట్లు, పశ్చిమ నియోజకవర్గంలో 23,124 మందికి రూ.6.98 కోట్లు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి 11,346 మందికి రూ.3.41 కోట్లు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. జనవరి నుంచి రూ.3000 పెన్షన్‌తో పాటు, అదనంగా 805 మందికి నూతనంగా మంజూరు చేసినట్లు తెలిపారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేస్తూ, ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి దశల వారీగా పెంచుతూ రూ. 3000 చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే ముస్తఫా



రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

22న ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల

కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల: జిల్లాలో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను జనవరి 22న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా వెల్లడించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పుల కోసం ఇప్పటివరకు 1,84,258 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించినట్లు చెప్పారు. ఫామ్–6,7, 8 కలిపి ఇప్పటివరకు 417 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. నూతన ఓటర్ల నమోదు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నామినేషన్‌కు పది రోజుల ముందు వరకు కూడా ఓటర్ల నమోదు ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నేత ఇనగలూరి మాల్యాద్రి, బీజేపీ నేత కె.వి రామకృష్ణ, కాంగ్రెస్ నేత డి.రవి, టీడీపీ నేత ఎస్. కె. సంసుద్దీన్, సీపీఎం ప్రతినిధి సీహెచ్. గంగయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమ్మె విరమించాలి: కలెక్టర్

బాపట్ల అర్బన్: గర్భిణులు, పిల్లల ఆరోగ్య, పోషణ ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీలు తక్షణమే సమ్మెను విరమించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా బుధవారం కోరారు. సమ్మెను ఈనెల 5వ తేదీలోగా విర మించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో గత ఏడాది డిసెంబర్ 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని, వీరితో ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపి పలు డిమాండ్లను అంగీకరించిందని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు, పోపు దినుసులు, అంగన్‌వాడీల నిర్వహణ ఖర్చుల్ని ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. అంగన్‌వాడీ హెల్పర్లను వర్కర్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ జీవో 44ను జారీ చేసిందని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కొనసాగింపు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. అద్దెలకు రూ.66.54 కోట్లు, పరిపాలన ఖర్చులకు రూ.7.81 కోట్లు, నిర్వహణ, చిన్నచిన్న మరమ్మతులకు రూ.6.36 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలకు జీతాల్ని పెంచిందని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను అర్హులుగా గుర్తించి డీబీటీ ద్వారా రూ.1313 కోట్లు అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించి విధుల్లో చేరాలని, సేవాభావంతో ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు.

మానవత్వం చాటుకున్న హనిమిరెడ్డి

రోడ్డు ప్రమాదానికి గురైన మహిళను కారులో తరలింపు



బాధితురాలిని కారులో ఎక్కిస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి: రోడ్డు ప్రమాదానికి గురైన మహిళను తన కారులో వైద్యశాలకు తరలించి మానవత్వం చాటుకున్నారు అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి. ఆయన బుధవారం సంతమాగులూరులో నూతన పింఛన్ల కార్యక్రమ సభలో పాల్గొని, కారులో అద్దంకి వెళుతున్నారు. మార్గమధ్యంలో సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద ప్రమాదంలో గాయపడిన మహిళ కనిపించింది. వెంటనే కారు ఆపి ఆమెను పరామర్శించారు. నలుగురితో పాటు తాను సాయం పట్టి తన కారులో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. స్థానికులు ఆయన్ను ప్రశంసించారు.

ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష అండ

డీఎంహెచ్‌వో విజయమ్మ



వైద్య శిబిరంలో డీఎంహెచ్‌వో విజయమ్మ

చీరాల: జగనన్న ఆరోగ్య సురక్ష–2 ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మరియమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష అమలు తీరును బుధవారం ఆమె పరిశీలించారు. శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజిస్ట్, కంటి వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్య బృందంతో 321 మందికి వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు, కేస్ రికార్డు షీట్లు అందించారు. ఆరోగ్య సురక్ష పథకంలో వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన స్టాళ్లు, పౌష్టికాహారం, హెల్ప్‌డెస్క్, అందిస్తున్న సేవలు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఫార్మాసిస్టులు, రక్త పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు అందించారు. వైద్యశాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇంటింటా సందర్శించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఐసయ్య, వైద్యులు నవీన్‌కుమార్, శిరీష,చంద్రశేఖర్, కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజ్ పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన విద్యుత్ ఏఈ

- రైతు నుంచి లంచం తీసుకుంటూ దొరికిపోయిన రాజుపాలెం ఏఈ
- వ్యవసాయానికి ట్రాన్స్‌ఫారం బిగించేందుకు రూ. లక్ష లంచం డిమాండ్



లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ విద్యుత్ ఏఈ, ప్రైవేటు ఎలక్ట్రీషియన్

రాజుపాలెం: లంచం తీసుకుంటూ ఓ విద్యుత్ ఏఈ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. రైతు నుంచి రాజుపాలెం ఏఈ లంచం తీసుకుంటుండగా గుంటూరు ఏసీబీ అధికారులు కాపు కాసి బుధవారం పట్టుకున్నారు. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన రైతు సరికొండ వెంకటేశ్వరరాజు, బంధువులతో కలసి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డిసెంబర్ డిసెంబర్ 12న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాడు. దీనికి గాను ఏఈ వి.విజ్ఞానప్రసాద్‌ను వెంకటేశ్వరరాజు సంప్రదించగా, లక్ష రూపాయలు డిమాండ్ చేశాడు. దీనికి గాను మొదటి విడతగా రూ. 45వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మిగతా పైకం ట్రాన్స్‌ఫారాన్ని బిగించిన తరువాత ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టపడని రైతు వెంకటేశ్వరరాజు గుంటూరు ఏసీబీ అధికారుల్ని సంప్రదించాడు. బుధవారం గుంటూరు నుంచి సుమారు 50 మంది ఏసీబీ అధికారులు రాజుపాలెం విద్యుత్ కార్యాలయం వద్ద, రెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్‌లోను, గణపవరం సరిహద్దులలోను, ఉప్పలపాడులో గుర్తుపట్టని విధంగా మకాం వేశారు. అదే సమయంలో విద్యుత్ ఏఈకి ఫోన్ చేయగా' నేను వస్తున్నాను.. నువ్వు రెడ్డిగూడెంలో ఉండ'ని రైతుకు చెప్పాడు. ఏఈతో పాటు ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఎస్‌కె. ఆదాంషఫీ రెడ్డిగూడెం వచ్చి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రేకుల షెడ్‌లో వెంకటేశ్వరరాజు నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పేదల ప్రభుత్వానికి ప్రజాబలమే అండ

ఎమ్మెల్యే కోన రఘుపతి



చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే రఘుపతి

బాపట్ల: నిరుపేద కుటుంబాల్లోని అవ్వాతాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక పథకం లబ్ధిదారులకు పెంచిన పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాకినాడ నుంచి బుధవారం ప్రారంభించగా జిల్లాలోని ప్రజలంతా తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. వైఎస్ఆర్ పింఛన్ కానుక కింద పెంచిన నగదు పంపిణీ కార్యక్రమాన్ని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కలిసి స్థానిక కలెక్టరేట్లో లాంఛనంగా ప్రారంభించారు.అర్హులైన వారందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పింఛను పంపిణీ చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లాలో 2,37,129 మందికి పెరిగిన పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. దీని కోసం ప్రతినెలా రూ.70 కోట్ల నిధులు జిల్లాకు విడుదల అవుతాయన్నారు. 3,437 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు వివరించారు. నిరాదరణకు గురైన వారిని ఆదుకోవడానికి పింఛన్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం నిరుపేదల ప్రభుత్వమని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెనుకాడ లేదన్నారు. క్రమం తప్పకుండా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడం అభినందనీయమని తెలపారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ బి. అర్జునరావు, పీడీగా నూతన బాధ్యతలు స్వీకరించిన సీహెచ్. కృష్ణ, డీఆర్‌డీఏ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సీఎం జగన్ లక్ష్యం

భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఒకటలో సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి పౌరుడి సమగ్ర ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తొలి దశ విజయవంతమై, ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఏపీ డెప్యూటీ హెల్త్ సెక్రటరీ మంజుల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.రవి, డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశంలో ఏపీలోనే అత్యధిక పింఛన్లు

- ప్రతి ఒక్కరిపై జగన్‌ను మళ్లీ సీఎంగా చేసే బాధ్యత
- నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కరణం బలరాం



లబ్ధిదారురాలికి నూతన పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, సేవ చేసే ముఖ్యమంత్రిగా గుర్తింపు సాధించారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుక, నూతన ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పడు.. మడమ తిప్పడు అనే దానికి రూ.3 వేల పింఛన్ పెంపే నిదర్శనమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎక్కువగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా ఏపీ గుర్తింపు సాధించిందని చెప్పారు. నవరత్నాల పేరుతో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా సంక్షేమ రాష్ట్రంగా మార్చారని వివరించారు. అవ్వాతాతలు తమ బిడ్డగా ముఖ్యమంత్రిని చూస్తున్నారన్నారు. కొడుకు, కూతుర్లు ఉన్నా వృద్ధులు కొందరు అనాథలుగా ఉన్న పరిస్థితిల్లో నెలకు రూ.3వేలు పింఛన్ ఇస్తూ సొంత బిడ్డగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో నాలుగున్నరేళ్ల కాలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరిగిందని, పట్టణం, రూరల్ గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేశామని వెల్లడించారు. ఒక్క పింఛన్ పెంపుతో కాకుండా అన్నీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కరణం వెంకటేష్ నియోజకవర్గ పర్యటనలో చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగిందని, త్వరగా కోలుకుని ఈనెల 21న ప్రజా సాధికార బస్సు యాత్రలో పాల్గొంటారని తెలిపారు. చీరాల ఆర్డీవో సరోజినిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా మంజూరైన పింఛన్లలో మున్సిపాలిటీలో 7455 మందికి రూ.2.07 కోట్లు పంపిణీ చేశామని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా చేసేందుకు సీఎం, ఎమ్మెల్యే కరణం ప్రోత్సాహం మరువలేనిదని కొనియాడారు. అనంతరం లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందించారు. కార్యక్రమంలో కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బి. జైసన్‌బాబు, ఎస్.రామసుబ్బులు, కౌన్సిలర్లు బి.అనీల్, కె.అరుణ్, సీహెచ్.బాలకృష్ణ, ఎబినేజర్, జి.ప్రభాకరరావు, షేక్ కబీర్, మహిళా విభాగం నాయకులు ఎం.లలిత, వెంకటేశ్వరమ్మ, నాయకులు యాతం మధుకర్, పట్టణాధ్యక్షులు కె.బాబ్జి, అనీల్, శ్రీను, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వై.రామకృష్ణ

బాపట్ల: జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా వై.రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనతో పాటు డీఆర్‌డీఏ పీడీగా చొప్పర కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇరువురు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి కృషి చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఇరువురికి సూచించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుతో గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

జిల్లా మైన్స్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ: ప్రభుత్వం గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రధాన కూడళ్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసిందని జిల్లా మైన్స్ ఏడీ ఆర్ రాజేష్‌కుమార్ వెల్లడించారు. బుధవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ శ్రీనివాస, సత్యకృష్ణ ఇంపీరియల్ గ్రానైట్ క్వారీలను ఆయన పరిశీలించారు. పర్మిట్ లేకుండా, సీనరేజ్ చెల్లించకుండా, అక్రమంగా గ్రానైట్ రాళ్లు తరలించకుండా ఉండేందుకు గానూ ఎగుమతికి సిద్ధంగా ఉన్న బ్లాకులకు నంబర్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీనరేజీకు చెల్లిస్తున్న పర్మిట్‌తోనే గ్రానైట్ రాళ్ల ఎగుమతులు చేపట్టాలన్నారు. అక్రమంగా తరలిస్తే లారీలకు పెనాల్టీ విధించటంతో పాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయటంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, దళారీ వ్యవస్థకు కొంతమేర చెక్ పడిందని ఏడీ అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు చరిత్రాత్మకం

- అద్దంకి అభివృద్ధికి రాజీలేని కృషి
- నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి



లబ్ధిదారులకు పెంఛన్ అందజేస్తున్న హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: మాటతప్పని మడమ తిప్పని నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి వైస్ చైర్మన్ పద్మేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనిమిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి అందజేస్తున్నారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రతి నెల 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్లు వచ్చి తలుపుతట్టి పింఛన్ అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అద్దంకి ప్రజల అండదండలు ఉంటే కొండలనే కాదు అనకొండలైనా ఎదుర్కొంటానన్నారు.తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అద్దంకి ప్రజలు విశేషమైన ఆదరాభిమానాలు చూపిస్తున్నారన్నారు. పట్టణంలో పాత, కొత్త పింఛన్ లబ్ధిదారులు 4006 మందికి గానూ రూ.1.20 కోట్ల చెక్కును పురపాలక సంఘ చైర్మన్ ఎస్తేరమ్మకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. అంతకుముందు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనంత లక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్‌లు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

హామీలను నిలబెట్టుకున్న ఘనత సీఎం జగన్‌దే..

నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఆమంచి

మార్టూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నిలబెట్టుకున్న ఘనత సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ప్రశంసించారు. మార్టూరు మండలంలో బుధవారం కొత్తగా మంజూరైన 525 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ. 3 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన హృదయ నేత వైఎస్. జగన్‌మోహనరెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన హామీల్ని నిలబెట్టుకునేందుకు పెన్షన్‌ను రూ 3 వేలు వరకు పెంచారని తెలిపారు. దివంగత నేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.200 లుగా ఉన్న పెన్షన్‌ను ప్రస్తుతం రూ.3 వేలకు పెంచారని చెప్పారు. హామీలన్నీ నెరవేర్చిన జగనన్నను మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, మార్టూరు ఎంపీడీవో నితిన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ గడ్డం మస్తాన్‌వలి, తిరుపతి రాజు, తిమ్మిరి బండ సర్పంచ్ జంపని వీరయ్య చౌదరి, ఇసుక దర్శి సర్పంచ్ సత్తెనపల్లి నారాయణమ్మ, ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యరాజ్, కోనంకి సర్పంచ్ గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కొత్తగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవితఖైదు

నగరంపాలెం: హత్య కేసులో ముందాయికి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ బాపట్ల జిల్లా 4వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ బుధవారం అందించిన వివరాలు.. పొన్నూరు మండలం కసుకర్రులో 2016లో కుటుంబ నేపథ్యంలో అంబటి వెంకటశివశ్రీనివాసరావు తన బావమరిది ఆళ్ల రఘునాథ్‌బాబును దారుణంగా హత్య చేశాడు. ఈ మేరకు పొన్నూరు రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేయగా, అప్పటి సీఐలు బాలసుబ్రహ్మణ్యం, చంద్రమౌళి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాది, బాధితులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, భౌతిక సాక్ష్యాధారాలను సేకరించారు. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. నేరం రుజువు కావడంతో అంబటి వెంకట శివశ్రీనివాసరావుకు శిక్షను ఖరారు చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి సీఐ బాలసుబ్రహ్మణ్యం ప్రస్తుతం డీసీఆర్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు అధికారి, పొన్నూరు రూరల్ పీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గవర్నమెంట్ ఐ.టి.ఐ. తెనాలి – 522201 గుంటూరు జిల్లా

టెండర్ ప్రకటన తేది: 02.01.2024

Kornapeta, Tenali

సం/- జాయింట్ కలెక్టర్/ ... , గుంటూరు జిల్లా వారి తరుపున
Principal, Govt. ITI, Tenali. Cell No: 8886856262

జగనన్న పాలనలో అర్హులందరికీ పింఛన్లు

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి



పింఛన్లు పంపిణీ చేస్తున్న వరికూటి

వేమూరు: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళ, కళాకారులకు విడతల వారీగా పింఛన్ రూ.3వేలకు పెంపుదల చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పక్ష నాయకుడిగా ఉన్నపుడు అధికారంలోకి వస్తే వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, కళాకారులకు విడతల వారీగా పింఛన్ రూ.3వేలకు పెంచుతానని వాగ్దానం చేశారన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, పింఛన్లు విడతల వారీగా పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, అదనంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. వేమూరు మండలానికి 7,910 మందికి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అదనంగా 158 కొత్త పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీలో పింఛన్‌దారులు చనిపోతే వారి స్థానంలో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పింఛన్లు ఆరు నెలలకు ఒకసారి మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. చావలి గ్రామంలో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, జేసీఎస్ కన్వీనర్ దాది సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు షేక్ బాజీ, కోఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, కుంపటి దావీదు, సాంబయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకం

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ




డీఎంహెచ్‌వో విజయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

బాపట్ల అర్బన్: వైద్య, ఆరోగ్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర ఎంతో కీలకమైందని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌ల నెలవారీ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ పాల్గొన్నారు. జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి డాక్టర్ విజమ్మను ఘనంగా సన్మానించారు. ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా అధ్యక్షుడు భయ్యా శంకర్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లోని ల్యాబ్‌లలో వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం 64 రకాల పరీక్షలను చేయాలని ఆదేశించిందని, దానికి అనుగుణంగా ప్రతి ల్యాబ్‌లో వసతులు కల్పించాలని కోరుతూ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ దృష్టికి తీసుకువచ్చారు. డాక్టర్ విజయమ్మ స్పందిస్తూ వసతుల కల్పన విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్‌ల ప్రధాన కార్యదర్శి సత్యం రాజు కూరపాటి, కరుణ్, వెంకట్, గోపి, తిరుపతిరావు, నాగిని, చంద్రకళ, నాగబాబు, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్‌లో రైలు ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 07089 సికింద్రబాద్- బరంపూర్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 7, 14 తేదీలలో ప్రత్యేక రైలు ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ రైలు సికింద్రబాద్ నుంచి సాయంత్రం 7.45 గంటలకు బయలుదేరి బరంపుర్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07090 బరంపూర్- వికారాబాద్ రైలు ఈనెల 8,15 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07091 వికారాబాద్- బరంపూర్ రైలు ఈనెల 9, 16 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు బరంపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని చెప్పారు. 07092 బరంపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10, 17వ తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి ఉదయం 6.30 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 08548 శ్రీకాకుళం- వికారాబాద్ రైలు ఈనెల12, 19, 26 తేదీలలో శ్రీకాకుళం నుంచి సాయంత్రం 5 గంటలకు బయలు దేరి వికారాబాద్ స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 9 గంటలకు చేరుకుటుందని చెప్పారు. 08548 వికారాబాద్- శ్రీకాకుళం రైలు ఈనెల 13, 20, 27 తేదీలలో వికారాబాద్ స్టేషన్ నుంచి రాత్రి 8.25 గంటలకు బయలుదేరి శ్రీకాకాళం స్టేషన్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07272 కాకినాడ టౌన్- సికింద్రబాద్ రైలు ఈనెల 13వ తేదీన కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07093 సికింద్రబాద్ -బరంపూర్ రైలు ఈనెల 8,15 తేదీలలో సికింద్రబాద్ స్టేషన్ నుంచి రాత్రి 7.45 గంటలకు బయలు దేరి బరంపూర్ స్టేషన్‌కు మరుసటి రోజు 11.15 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. 07094 బరంపూర్-సికింద్రబాద్ రైలు ఈనెల 9,16 తేదీలలో బరంపూర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. 07251 నరసాపూర్- సికింద్రబాద్ రైలు ఈనెల 10వ తేదీ నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.50 గంటలకు సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 07252 రైలు సికింద్రబాద్- నరసాపూర్ రైలు ఈనెల 11వ తేదీన సికింద్రబాద్ స్టేషన్ నుంచి ఉదయం 8.35 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించి ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ విజయ సంకల్ప యాత్ర



గుంటూరు మెడికల్: బీజేపీ విజయ సంకల్ప యాత్ర బుధవారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు వేళంగిని నగర్ వద్ద యాత్రను బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చారని, ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచారన్నారు. భారత్ సంకల్ప యాత్ర దేశ వ్యాప్తంగా వంద రోజులపాటు జరుగుతోందని వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందనకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, బీజేపీ నేతలు ఆలపాటి రవికుమార్, చెరుకూరి తిరుపతిరావు, కుమార్‌గౌడ్, పాండురంగ విఠల్, వై.వి.సుబ్బారావు, మంత్రి సుగుణ, దుర్గా భవానీ, మేరి సరోజని పాల్గొన్నారు.

బాపట్ల పురపాలక సంఘం
"ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన"

ఆర్.ఓ.సి.నెం.649/2023/ఇ1 తేది.03-01-2024

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన అభివృద్ధి పనులను చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హత గల రిజిష్టరు కాంట్రాక్టరు వారల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in (procurement place) నందు చూడగలరు. మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత విభాగము నందు అడిగి తెలుసుకొనగలరు.

పనుల సంఖ్య	: 2
అంచనా విలువ	: రూ॥ 2,82,34,335/-
1) టెండరు షెడ్యూలు ప్రారంభపు తేది	- 04.01.2024 ఉదయం 10.00 గం॥లకు
2) టెండరు షెడ్యూలు వేయుటకు ఆఖరుతేది	- 18.01.2024 ఉదయం 10.00 గం॥లకు
3) టెండరు షెడ్యూలు స్వీకరించు చివరితేది	- 18.01.2024 ఉదయం 11.00 గం॥లకు

సం/- కమీషనరు, బాపట్ల పురపాలక సంఘం

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు **11 డిమాండ్లతో 12.12.2023** నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం **G.O** లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ **20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44** జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి **TA/DA** మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు ద్వైమాసిక **TA/DA** క్లెయిమ్ చేయడానికి మెమో నం.**2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023** జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం **రూ.1,00,000/-** మరియు **రూ.40,000** అందించడానికి **జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023** జారీ చేయబడింది.

d) అద్దెలు **(Rs66.54 Crs)**, పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) **(Rs.7.81 Crs)** మరియు **AWCల** నిర్వహణ (చిన్న మరమ్మతులు) **(రూ.6.36 Crs)** కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను **రూ.11,500/- లకు,** మినీ అంగన్ వాడీ జీతాలను **రూ.7,000/- కు,** అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను **రూ.7,000/-** కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా **రూ.1,313 కోట్లు** అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా **రూ. 2 లక్షల** వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం **(NFSA)**, 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్‌వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. **ICDS** పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం **(HCM)** మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. **AWW** లు & **AWH**లు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, **THR** మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ **(SNP)** లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ **ANM** సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పరిమితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలిసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్‌వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, బాపట్ల జిల్లా